# చేతులు కాలిన తరువాత...

బద్దేపూడి సుధారాణి

గాలి తాకిడికి చెట్లు వూగిపోతున్నాయి. దూరంగా వున్న స్మశానంలో నుంచి కుక్కల అరుపులు, తీతువు పిట్టల అరుపులు వినిపిస్తున్నాయి. హాస్పిటల్ పరిసరాల నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నైట్ డ్యూటీ నర్సుల చెప్పుల టకటకలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు వినవచ్చే రోగుల మూలుగులు, ప్రసవవేదన పడుతున్న స్త్రీల రోదనలు మాటి మాటికి వినిపిస్తున్నాయి. టైము రాత్రి పన్నెండు గంటలు కావస్తున్నది.

ఆలోచనలో నుండి తేరుకుని శూన్యం లోకి చూస్తూ బాధగా నవ్వుకున్నాడు రవీంద్ర. హాస్పిటల్ పరిసరాలని ఒక్కసారి కలయజూసి మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు.

"మిస్టర్ రవీంద్రా! డాక్టర్ మిమ్మల్ని పిలుస్తున్నారు" నర్స్ పిలుపుకి వులిక్కిపడి చూచాడు. ఆమె మరోసారి చెప్పి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపు ఒక్కక్షణం చూసి నిట్టూరుస్తూ, భారంగా అడుగులు వేస్తూ డాక్టర్ కన్సల్టింగ్ రూమ్‌లోకి ప్రవేశించాడు రవీంద్ర.

"మిస్టర్ రవీంద్రా! ప్లీజ్ బి సీటెడ్" డాక్టర్ చిన్నగా అన్నాడు. రవీంద్ర మౌనంగా కూర్చున్నాడు.

"చూడండి రవీంద్రా, మీ మిసెస్‌కి ఆపరేషన్ చేయబోతున్నాను. మందులవల్ల ఇంజక్షన్లవల్ల కోలుకోవటం కష్టం. ఆపరేషన్ చేయక తప్పదు. హార్ట్ ఎన్ లార్జి అయింది. ఆమె బ్రతకటమనేది మీ అదృష్టాన్ని బట్టి వున్నది. ఆపరేషన్ సక్సెస్ కావటానికి నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను. ఆమె ఉపవాసాలతో తిండి తినక బాగా శుష్కించి పోయింది. బ్లడ్ బాగా తగ్గిపోయింది. మనోవ్యాధి కూడా తోడైంది ఆమెకు. ఆమె కోలుకోవాలంటే చాలా టైము పట్టేలా వున్నది. గుండె పోటు అంటే సామాన్యమైన జబ్బు కాదు. మీరు ఆమెను కలుసుకొని ధైర్యం చెప్పాలి." గంభీరంగా చెప్పాడు డాక్టర్.

"డాక్టర్—ప్లీజ్ ఎంత డబ్బు అయినా సరే యిస్తాను. రాధను బ్రతికించండి. ఆమె బ్రతికి తీరాలి...." దీనంగా అడిగాడు రవీంద్ర.

రవీంద్ర వైపు జాలిగా చూసి ఏదో ఆలోచిస్తూ వార్డుల వైపు గబగబా వెళ్ళిపోయాడు డాక్టర్ శర్మ.

తడబడే అడుగులతో రాధ పడుకున్న రూమ్ చేరుకున్నాడు రవీంద్ర. బెడ్ మీద అస్థిపంజరంలా పడి వున్నది రాధ. ప్రపంచంలోని దుఃఖాన్నంతా భరించి అలసిపోయినట్లుగావున్నది ఆమె మొహం. ఆ మొహంలో విషాదచ్ఛాయలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఆమె పెదవులు ఒణుకుతున్నట్లున్నాయి. చెంపలు లోతుకుపోయి, దవడ ఎముకలు స్పష్టంగా లెక్కపెట్టేందుకు వీలుగా కనిపిస్తున్నాయి.

ఆమె వున్న తీరు చూచిన రవీంద్రకి దుఃఖం ఆగలేదు.

"రాధా! నన్ను క్షమించవూ!" వణుకుతున్న స్వరంతో చిన్నగా అన్నాడు.

రాధ బరువుగా కనురెప్పలు ఎత్తి జాలిగా రవీంద్రవైపు ఒకసారి చూసి చిరునవ్వు నవ్వింది. ఎండిపోయిన ఆమె పెదవులు బలవంతంగా విచ్చుకున్నాయి.

"నన్నూ నా బ్రతుకును చూసి పరిహసిస్తున్నావా రాధా? అవును మరి నా జీవితంలో ఓడిపోవటం ఇది రెండవసారి. నా జీవిత గమనంలో ప్రతి అడుగూ త్వరగా వేశాను. గుడ్డిగా ప్రవర్తించాను. నేను చేసిన పాపం సామాన్యమైనది కాదు. నేను....నేను....దుర్మార్గుణ్ణి రాధా!"

"ఎందుకు అట్లా బాధ పడతారు? నాకీ జబ్బు తొందరగానే నయమవుతుంది. భయపడకండి" నూతిలో నుండి వచ్చినట్లున్నది ఆమె స్వరం.

"రాధా నన్ను క్షమించానని ఒక్కమాట అను చాలు. నీకు తీరని ద్రోహం చేసిన దుర్మార్గుణ్ణి. నీవు దేవతవని తెలుసుకోలేని నిర్భాగ్యుణ్ణి. నీలోని మంచితనం గ్రహించలేని నీచుణ్ణి అయాను. కానీ ఈనాటికైనా భగవంతుడు నా కళ్ళు తెరిపించాడు. రాధా! ఇక నిన్ను అన్యాయం చేయను. ఇక నా సర్వస్వం నీవేరాధా. నిన్ను దేవతలాగా పూజించుకుంటాను. నా కోసం నీవు మామూలు మనిషివి కావాలి—తప్పదు. నా కోసం నీవు బ్రతకాలి. నా మీద నీకు ఏ మాత్రం ప్రేమ వున్నా అది ద్వేషంగా మార్చుకోకు. నన్ను ఒంటరివాణ్ణి చేయకు. మాట్లాడవేం రాధా! నీ మౌనంతో నన్ను శిక్షించకు" రవీంద్ర కంఠం వణికింది.

"కోమల ఎక్కడ వున్నది? కోమలని ఒకసారి తీసుకురండి" హీనస్వరంతో అడిగింది రాధ.

"రాధా....ఇంకా నన్ను పరీక్షిస్తున్నావా? అది రాక్షసి. దానిపేరుఎత్తకు. ఆ ధనపిశాచి నా సర్వం దోచుకుని నన్ను భ్రష్టుణ్ణిచేసి—నన్ను నా బ్రతుకుని పదిమందిచేత హేళన చేయించిన పాతకి. దేవత లాంటి నీవు ఆ దుర్మార్గురాలి పేరు ఎత్తకు." అతని కంఠంలో ఆవేశం ధ్వనించింది.

"మిస్టర్ రవీంద్రా. పేషెంట్‌ని విసిగించకండి. ఆమెకి రెస్ట్ అవసరం. మీరు ఇక్కడ వుండవద్దు." నర్స్ వచ్చి హెచ్చరించింది.

రాధ నీళ్ళు నిండిన కళ్ళతో దీనంగా చూసింది రవీంద్ర వైపు.

రాధ రెండు చేతులు అందుకుని మొహం దాచుకుని బావురుమన్నాడు రవీంద్ర.

"పసిపాపలా ఏమిటా ఏడుపు? అన్నింటికి ఆ భగవంతుడే మనల్ని కాపాడుతాడు. దిగులు పడకండి" చిన్నగా మందలించింది రాధ.

"నిజం రాధా. నీలాంటి పుణ్యమూర్తిని భగవంతుడే కాపాడతాడు. నన్ను క్షమించానని ఒక్కమాట అనవూ!" రాధ కళ్ళల్లోకి చూస్తూ జాలిగా అడిగాడు రవీంద్ర.

"మిస్టర్ రవీంద్రా డాక్టర్ వస్తున్నారు." నర్స్ మళ్ళీ హెచ్చరించింది.

నర్సుని కసిగా చూసి, మనసులోనే తిట్టుకుంటూ బయటకి నడిచాడు రవీంద్ర. వెనక్కి తిరిగి ఒక్కసారి రాధను జాలిగా చూచాడు.

రాధను టెస్ట్ చేసిన డాక్టర్, నర్సుతో ఏదో చెప్పగానే, రాధను స్ట్రెచెర్ మీద ఆపరేషన్ థియేటర్ కి తీసుకు వెళ్ళారు. నీళ్ళు చిప్పిల్లుతున్న కళ్ళతో రాధ తననే చూస్తూ వెళుతున్నది. తన నుండి రాధను దూరం చేయటానికి వీలు లేదని గట్టిగా అరవాలనిపించింది రవీంద్రకు.

ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి. రవీంద్ర హాస్పటల్ వరండాలోని బెంచీమీద కూలబడ్డాడు.

ఆపరేషన్ చేయటానికి యింకా వ్యవధి వుంది కాబోలు, రాధ మూలుగు అంతకంతకు స్పష్టమవుతున్నది. ఆ మూలుగు తన గుండెల్ని పిండుతున్నట్లునిపించింది. కళ్ళు మూసుకుని గతాన్ని చర్వితచర్వణం చేసుకున్నాడు.

*


తను ఒక్కడే తల్లితండ్రులకి సంతానం కావటంతో బాగా గారాబంగా పెంచారు. ఆస్తి పాస్తులకు లోటులేదు. తను కాలేజీలో చేరిన తొలి రోజులు అవి.

ఒక రోజు తను కాలేజీనుండి ఇంటికి రాగానే అమ్మ దిగులుగా వుండటం గమనించాడు.

"ఏమిటమ్మా! అట్లావున్నావు? ఏమైంది" అని అడిగాడు ఆదుర్దాగా.

అమ్మ మౌనంగా ఒక ఉత్తరం అందించింది.






అది ఆత్రంగా అందుకుని చదువుకున్నాడు. అది తన మేనమామ రాసిన ఉత్తరం.

చి॥ శాంతకు,

నీ అన్న వ్రాయునది. రాధకు ఎన్నో సంబంధాలు చూచాను. దానికి పెళ్ళి అవుతుందని ఆశ లేదు. నా అంత దురదృష్టవంతుడు ఈ ప్రపంచంలోలేడు. నాకు ఇక బ్రతకాలనే ఆశ కూడా లేదు. చెల్లెలివి నీకు తోచిన సలహా యిస్తావని రాస్తున్నాను, ఎంత గొప్పింటిదానవు అయినా తోబుట్టువుగా నా మాటకు విలువయిస్తావని ఆశిస్తున్నాను.

నీ అన్న
రామనాథం

ఆ ఉత్తరంలో మామయ్య రాసిన ప్రతి మాటా నా హృదయాన్ని కదలించి వేసింది. పాపం మామయ్యకు ఆస్తిపాస్తులు లేకపోవటమే కారణం కావచ్చు; కట్నాలు యివ్వలేని పరిస్థితుల్లో పెళ్ళి ఏం చెయ్యగలడు? ఎట్లా చేయగలడు? అనిపించి ఎంతో బాధపడ్డాను. ఎలాగైనా సరే మావయ్యని గురించి వివరాలు అడిగి తెలుసుకోవాలనుకున్నాను....అప్పుడప్పుడు మావయ్య వచ్చి పోతున్నా, ఆయన భార్యగాని పిల్లలుగాని తనకి వూహ తెలిసిన తరువాత రాలేదు. వాళ్ళు ఎట్లా వుంటారో కూడా చూడలేదు. మావయ్య కూతురు ఎట్లా వుంటుందో చూడాలనిపించేది ఒక్కోసారి.

తన ఆలోచనలన్నీ మావయ్య చుట్టూ తిరిగేవి.

ఆ రాత్రి భోజనాలు చేసేటప్పుడు అమ్మ నాన్నగారితో అంటున్నది.

"మా అన్నయ్య ఉత్తరం చూశారుగా? మీ అభిప్రాయం ఏమిటి?" అన్నది చిన్నగా.

"జానకీ అంటున్నానని కోపమేమో నీకు. ఎందుకు చెబుతున్నానో బాగా విని అర్థంచేసుకో. మీ అన్నగారిక్ కోరికలు చాలా వున్నాయి- ఉట్టికి ఎగరలేనివాళ్ళు స్వర్గానికి ఎగరాలని ఆశపడ్డట్టు. నాకు అంతా తెలుసు. రవి మనకి ఒక్కగానొక్కడు. నా దృష్టిలో వాడికి ఏ లోపమూ లేదు. లక్షణంగా వాడికి కట్నంతోపాటు, అన్ని లక్షణాలు వున్న అమ్మాయే వస్తుంది. రావాలని నా కోరిక. ఇంక నీ అభిప్రాయాలు అంటూ నన్ను విసిగించకు," అన్నారు నాన్న.

"అదేమిటండీ! మా అన్నయ్య మూడు నాలుగు వేలవరకు కట్నం యివ్వగలడుట." అమ్మ మనస్సులో బాధపడ్డా నాన్నగారి మాటలకి పైకి మామూలుగానే అన్నది.

"వూ....మూడు, నాలుగు యిచ్చినా, పది యిచ్చినా, నీ కోడలి అందచందాల సంగతి ఆలోచించు. నాకు వున్న పేరుకి, హోదాకి—చూస్తూ... చూస్తూ అట్లాంటి పిల్లని తెచ్చుకొని హేళనకావటం నాకు ఇష్టంలేదు" అంటూ నాన్న గబగబా అన్నం తిని చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయారు. ఆ రోజు ఎంతో తొందరగా భోజనం ముగించుకుని వెళ్ళిపోయారు నాన్న. రోజూ అయితే, తన బిజినెస్ గురించి, కొనబోయే ఇళ్ళు, స్థలాలని గురించి అమ్మతో గంటల తరబడి చర్చించేవారు భోజనాల ముందు. బహుశా మావయ్య ఉత్తరం కారణం కావచ్చు—ఆ రోజు నాన్నలోని మార్పుకి కారణం అనుకున్నాడు తను.

అమ్మ చీర కొంగుతో కళ్ళొత్తుకుంటూ కూచుంది. ఆ పూట ఆమె భోజనం చేయలేదు. నాన్నగారి మాటల ధోరణి ఆమెకి బాధ కలిగించి వుండవచ్చు.

"అమ్మా! మావయ్యకి కార్లు మేడలు లేవు కాబోలు. ఆయనకి కాస్త ఆస్తి వున్నట్టయితే నాన్న ఘనంగా చెప్పేవారు ఆయన్ని గురించి. నాన్నకి డబ్బు ఆశ ఎక్కువ అని తెలిసికూడా, ఆయన మాటలకి నీవు బాధపడటం ఎందుకమ్మా?" అన్నాడు తను.

"అదికాదురా బాబూ! మీ మావయ్య కూతుర్ని నువు ఎప్పుడూ చూసి వుండవు. నల్లగా ఉంటుందని దాన్ని ఎవరూ చేసుకోనంటున్నారు. పి.యు.సి. వరకు చదువుకుంది. కానీ ఏం లాభం అందచందాలు లేవు."

"అదేమిటమ్మా! నల్లగా వున్నంత మాత్రాన పెళ్ళి కాకుండా పోతుందా? నా కెందుకో ఆ అమ్మాయిని చూడాలని వుందమ్మా" అన్నాడు అప్రయత్నంగా తను.

"పోనీలే బాబూ నీకైనా నా వాళ్ళంటే జాలి, దయావుంది." అంటూ అమ్మ ఎంతో మెచ్చుకుంది.

"మావయ్యా వాళ్ళ ఊరు వెళ్ళి వద్దాము వస్తావా?" అని అడిగింది అమ్మ.

"నాన్నగారి పర్మిషన్ తీసుకున్నావా?" అని అడిగాడు తను.

"నాన్న రేపు ఏవో పనుల మీద ఊరేదో వెళతానన్నారు. మీ నాన్న వచ్చే లోపలే వెళ్ళి వచ్చేద్దాము. మనమేమీ తప్పు పని చేయటం లేదు కదా?" అన్నది అమ్మ. పాపం అమ్మకి వాళ్ళని చూడాలని ఎంత కోరికగా వుందో అనిపించింది. నాన్న మనస్తత్వానికి కోపం వచ్చింది.

మర్నాడు అమ్మా నేను ప్రయాణమైనాము. మామయ్య వాళ్ళ ఊళ్ళో దిగగానే ప్రాణం ఎంతో హాయిగా వుందనిపించింది. పట్న వాసాలతో విసిగిపోయి వుండటంచేత కాబోలు, ఆ పచ్చని పొలాలు ఆ వాతావరణం మనస్సుని అహ్లాదపరుస్తున్నది. నాకు తెలిసినంత వరకు అమ్మ మావయ్య వాళ్ళ ఊరు ఎప్పుడూ వెళ్ళినట్లే జ్ఞాపకం లేదు. పాతిక సంవత్సరాల తరువాత కూడా

అమ్మ ఎంతో గుర్తుగా ఎవర్నీ అడ్రసు అడక్కుండానే ఎప్పుడూ వచ్చేపోయే వూరులాగే సులభంగానే కనుక్కుంది వాళ్ళ ఇల్లు. ఇల్లు చాలా పురాతనమైనది. తలుపులు కొద్ది రోజులకి విరిగి పడిపోయేలా వున్నాయి. సగం విరిగిన గేటు తీసుకుని లోపలకి అడుగుపెట్టాము.

"వదినా! వచ్చారా? ఎన్నాళ్ళకి మా మీద దయగలిగింది మీకు....రండి రండి" అంటూ, ఒకావిడ ఎదురు వచ్చింది లోపలినుండి.

ఆమె తెల్లగా సన్నగా పొట్టిగా వుంది. నుదుట అర్ధరూపాయి అంత బొట్టుతో మాసిన ముతక చీరతో పెదవుల మీద చెరగనట్లున్న చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ వచ్చింది.

"ఇదిగో ఈమేరా మీ దుర్గ అత్త" అని నాకు పరిచయం చేసింది అమ్మ. ఆమెకు నమస్కరించాను. ఆమె నవ్వింది.

"వీడు నా కొడుకు రవీంద్ర. వీడి తరువాత ఆడపిల్లలు ఇద్దరు వున్నారు. మాలతి, వాసంతి. వాళ్ళిద్దరూ పట్నంలో చదువుకుంటున్నారు. వీడు ఎమ్. ఎస్ సీ. పరీక్షలు రాసి వచ్చాడు." అంటూ అమ్మ చెప్పింది.

నా కళ్ళు అత్తయ్య కూతురు కోసం నలువైపులా కలియజూడసాగాయి. ఆ అమ్మాయిని చూడాలనే ఆరాటం నాలో అధికం కాసాగింది.

ఒక గంట తరువాత అమ్మ అత్తయ్యని అడిగింది.


"అమ్మాయిఏది? కనిపించడం లేదేమిటీ?"అని.

"సంగీతం మాస్టారింటికి వెళ్ళింది. ఈ పాటికి వస్తుండాలి. ఆ .... ఏమిటోలే నా మొహం. "అన్నీ వున్నా అల్లుడి నోట శని" అని"ఎన్ని విద్యలున్నా దాని ఖర్మే బాగుండలేదు" అన్నది అత్తయ్య.

"పాపం అంత ఘోరంగా వుంటుందా ఏమిటి?" అనుకున్నాను. మరో అరగంట గడిచాక ఆ అమ్మాయి వచ్చింది.

"ఇదిగో యిదే రాధ" అన్నది అత్తయ్య. ఆ అమ్మాయి నల్లరాతి బొమ్మలా వున్నది. కానీ ఆ కళ్ళల్లో ఏదో ఆకర్షణ వున్నది.

ఆ పెదవులు ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉంటాయి. నన్ను ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది. సన్నగా నాజూగ్గా వుంది మనిషి మాత్రం. కానీ కారు




నలుపు. భగవంతుడికి న్యాయం లేదు. ఏదో ఒక వంక కల్పిస్తాడు. రాధను పరిచయం చేసుకుని పలకరించాను. ఆమె కమ్మని కంఠంతో ఎన్నో పాటలు విన్నాను. ఆమెనే పెళ్ళాడాలనిపించేది. ఆమె కంఠంలోని తీయదనం, ఆమె పాట నాకు అంత హాయిని కలిగించాయి. రాధ మంచి తెలివిగలది. చక్కగా పాడుతుంది. గుణవంతురాలు, చదువుకున్నది. ఆడపిల్లకి అది చాలు అనుకున్నాను. రాధ దగ్గర బాగా చనువు అయింది. అత్తయ్యా వాళ్ళు వున్నంతలోనే బాగా మర్యాదలు చేశారు. అమ్మా నేను తిరిగివస్తుంటే బట్టలు పెట్టారు. వాళ్ళ దొడ్లో కాసిన కొబ్బరి కాయలు, సపోటాలు యిచ్చారు బుట్టనిండా నింపి.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు అత్తయ్యా!" రాధ అడిగింది.

"నీ పెళ్ళికే మళ్ళీ వచ్చేది" అన్నది అమ్మ నవ్వుతూ. ఆ మాటకి అత్తయ్య మొహం రాధ మొహం ఏదోలా మారాయి.

మా ఊరు వచ్చేశాక, రాధ మరీ మరీ గుర్తుకు రాసాగింది. రాధకు ఉత్తరాలు రాసేవాణ్ణి — రాధ ఎంతో ప్రేమగా జవాబులు రాసేది. నేను రాధను మనస్ఫూర్తిగా ప్రేమించాను. రాధ లేని బ్రతుకు వృధా అనిపించేది. రెండు మూడు సార్లు ఒంటరిగా రాధావాళ్ళ ఊరు వెళ్ళి వచ్చాను అమ్మ నాన్నకి చెప్పకుండా.

రాధా నేను ఒకరి మనస్సులు ఒకరం అర్థం చేసుకుని మరింతదగ్గరైనాము. రాధను పెళ్ళాడి తీరాలనే పట్టుదల ఎక్కువైంది నాలో.

ఉన్నట్టుండి ఒక రోజు రాధ దగ్గర నుండి ఉత్తరం ఒకటి వచ్చి నా మనస్సుని గందరగోళ పరిచింది........!

"....బావా నాన్న నాకు తొందరగా వివాహం చేయాలనే పట్టుదలతో, ఒకడజను సంబంధాలు పైగా తీసుకువచ్చారు. నేను ఎవరికి నచ్చలేదుట. 'నువు చస్తే సగం పీడా వదులుతుంద'ని అరిచారు నాన్న. అమ్మ చాటుగా కళ్ళొత్తుకుంది. అంతకన్నా ఆమె చేయగలిగింది ఏమీ లేదు. మళ్ళీ ఈ రోజు ఒక సంబంధం వచ్చింది. అతనికి రెండవ పెళ్ళట, ముగ్గురు చిన్న పిల్లలున్నారుట. అతను ఒక బడిపంతులు, యాభై ఏళ్ళుదాటినాయి. బట్టతలతో పొట్టిగా లావుగా వున్నాడు. నన్ను చూడగానే చేసుకోవటానికి ఒప్పుకున్నాడుట. అమ్మా, నాన్న సంతోషంతో పొంగిపోయారు. 'నీకు ఇన్నాళ్ళకైనా భగవంతుడు దయతలచి కల్యాణ గీత తెప్పించాడు. లేకపోతే నీకీజన్మకి పెళ్ళి కాదేమో అని దిగులుపడ్డాము.' అన్నారు ఇంట్లో.

నాఅంగీకారం లేకుండానే నాన్న ఈ సంబంధం నిశ్చయంచేసి వివాహం చేయటానికి నిశ్చయించారు. నీకు తెలపటం నా విధి కదా! అని వ్రాస్తున్నాను. యింక ఏమీ వ్రాయలేని నిర్భాగ్యురాలు....

రాధ

అని రాసింది. ఆ ఉత్తరం చూడగానే నాలో ఏదో తెలియని ఆవేశం, మావయ్య మీద కోపం, ఏదో తెలియని పట్టుదలా ప్రవేశించాయి. అమ్మ దగ్గరకుపోయి చెప్పాను, రాధ వ్రాసిన విషయాలు.

[45 వ పేజీ చూడండి]

[చేతులు కాలిన తర్వాత : 37 వ పేజీ నుంచి]

"వాని ఖర్మ అది. ఏం చేస్తాం? అంతా దైవ నిర్ణయం. మన చేతిలో ఏమీ లేదురా'' అనేసింది.

ఆ రాత్రి అంతా ఆలోచనలతో గడిపాను. తెల్లవారిన తరువాత మావయ్య పేరులో ఒక ఉత్తరం రాసి పడేశాను.

"మీరు చూచిన సంబంధం రాధకు చేయటానికి వీలులేదు. రాధను నేను చేసుకుంటాను. మీకు రాధని నాకు యిచ్చి చేయటానికి ఇష్టం లేకపోతే యావజ్జీవితం బ్రహ్మచారిగా వుండిపోతాను....''అని వ్రాసి పడేశాను. మూడో రోజు కల్లా మావయ్య వచ్చాడు. నన్ను ఆశ్చర్యంగా, జాలిగా చూశాడు. నేను పట్టించుకోలేదు. మావయ్య నాన్నకి అంతా చెప్పేసరికి, నాన్న ఉగ్రనరసింహావతారం ఎత్తారు. అనరాని మాటలు అన్నారు. అమ్మ కూడా కోపంగానే వుంది.

మావయ్య కూడా మందలించాడు :‘ ‘నీకేంరా రాజాలా వుంటావు. ఆ దరిద్రురాలిని చేసుకుని నువేం సుఖపడతావు?'' అని.

ఆ క్షణంలో నాకు ఎవరి మాటలూ చెవికి ఎక్కలేదు. మావయ్య వెంట బయలుదేరాను. నాన్న, అమ్మ మాట కాదని.

మూడవరోజు పెళ్ళి అనగా ఆ రాత్రి రాధ నాతో అన్నది:

"బావా నువు త్యాగం చేస్తున్నావు. నన్ను చేసుకోవటానికి ఎందుకు సాహసిస్తున్నావో అర్థం కావటంలేదు. అందమైన వాళ్ళు, వేలకి వేలు కట్నాలు యిచ్చేవాళ్ళు, విద్యాధికులు వస్తారు నువు కావాలనుకుంటే. నన్ను తొందరపడి చేసుకుని జీవితాంతం బాధపడాల్సి వస్తుందేమో'' అంటూ, ఎంతో బ్రతిమాలుతున్నట్టుగా చెప్పింది.

"అవును కోరి చేసుకుంటానంటే అట్లాగే వుంటాయి కబుర్లు. నువు నన్ను పరీక్షిస్తున్నావా?" అన్నాను ఆవేశంగా.

"బావా! నువ్వు యింత కోపిష్ఠివి, తొందరపాటు మనిషివి అనుకోలేదు.'' అని కన్నీరు తుడుచుకుంటూ చిరునవ్వుతో క్షమాపణలు అడిగింది.

శుభలేఖలు పంపినా, మావయ్య స్వయంగా వెళ్ళి పిలిచినా, నాన్న రాలేదు; అమ్మని రానీయలేదు - నా పెళ్ళికి. వాళ్ళిద్దరూ లేకుండానే పెళ్ళి జరిగిపోయింది.

రాధని చేసుకుని తల్లితండ్రులకి దూరమయ్యాను. నా పెళ్ళి అయిన రెండేళ్ళ తరువాత నాన్న చనిపోయారు పక్షవాతం వచ్చి. తరువాత రెండేళ్ళకి అత్తయ్య కూడా చనిపోయింది. నేను జూఆలజీ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను. రాధతో నా జీవితం నందనవనంలా వుండేది. అమ్మ మాత్రం మౌనంగా వుండేది. చెల్లెళ్ళిద్దరికి పెళ్ళిళ్ళు జరిపించి పంపించేశాను. రాధ అమ్మని దేవతలా చూసేది. అన్ని పనులూ తనే చేసేది. అట్లా జరిగిపోతున్న రోజుల్లో, తోటి లెక్చరర్ జయరాంతో బాగా పరిచయం అయింది. అతను ఒకనాడు తన ఇంటికి తీసుకువెళ్ళాడు. కబుర్లు అయ్యాక తన చెల్లెలు కోమలని పిలిచి పరిచయం చేశాడు.

‘ఈమె నా సిస్టర్ కోమల ఎమ్. బి. బి. ఎస్.’ అంటూ. ఆమెను చూడగానే నా మతిపోయింది. ఆమెను చూడటానికి రెండు కళ్ళు చాలవేమో అనిపించింది. పాలరాతి బొమ్మలా వున్నది. కోమల చిరునవ్వు నా గుండెని ఝల్లుమనిపించింది. అద్వితీయమైన సౌందర్యం ఆమెది. ఎంతో చనువుగా, ఆప్యాయంగా మాట్లాడింది. ఆమె సమయంలో గంటలు క్షణాల్లా దొర్లిపోయినాయి. ఆమె అందమైన రూపం నా హృదయంలో చిత్రంగా హత్తుకుపోయింది.

"అప్పుడప్పుడు వస్తూండండి. మర్చిపోరు కదా.'' అంటూ నవ్వింది కవ్వింపుగా. "నిన్ను మరచిపోవటం ఆ బ్రహ్మకేమైనా తరమేమోగాని, నా తరం కాదు"అనాలనిపించింది. కానీ, మౌనంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాను.

ఇంటికి రాగానే, తెల్లని దుస్తుల్లో తల నిండా విరజాజులతో, చిరునవ్వుతో ఎదురైంది రాధ. ఆమెను చూడగానే నా హృదయం బాధతో మూల్గింది. కానీ అంతలోనే తమాయించుకుని మామూలు మనిషిని అయాను. కానీ ఏదో తెలియని అసంతృప్తి, బాధ నాలో ప్రవేశించాయి. జయరాం ఇంటికి రాకపోకలు ప్రారంభించాను. నా మనస్సు నా స్వాధీనం తప్పింది కోమలని చూడటంతో. నా మనస్సుకి కళ్ళాలు లేవు. కోమలతో నా పరిచయం పెరిగింది. ఆమె కవ్విస్తూ, నవ్విస్తూ మాట్లాడేది. ఆమె వశం అయాను. ఆమెతో సినిమాలు, షికార్లు ఎక్కువైనాయి. ఒక్కో రాత్రి నా ఆలోచనలన్నీ అనేక రూపాలు దాల్చేవి. రాధ అంటే విసుగెత్తింది. కోమల అందం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. కోమలని వివాహం చేసుకుంటేనో అనిపించేది. జయరాం తనకీ కోమలకీ పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. తన కోరిక ఏదీ కాదనడు. తన ఆలోచనలు వింతగా సాగేవి. తను ఇంటికి రాగానే చిరాగ్గా వుండటం చూసి ఎన్నోసార్లు అడిగింది రాధ.

"మీరు ఎందుకో మారిపోతున్నారు. ఈ మధ్య చిరాకు ఎక్కువైంది'' అంటూ వుంటే తను సమాధానం చెప్పకపోగా, మరింత విసుక్కునేవాడు.

రాధకు దూరం కావటానికి ప్రయత్నించసాగాడు. రాత్రిళ్ళు ఆలస్యంగా రావటం గమనించి కూడా, రాధ అడిగేదికాదు. ఒకవేళ అడిగినా ఆమెకి తను యివ్వబోయే సమాధానం ఎటువంటిదో ఆమె వూహించుకొని వుండవచ్చు. అందుకే ఎలాంటి ప్రశ్నా వేసేదికాదు.

కోమల ఒకసారి అడిగింది. "రవీ మీ ఇంటికి రావాలని వుంది. రమ్మంటావా?'' అని.

ముందు రమ్మనటానికి సంశయించినా, ఆమె మాట కాదనలేక పోయాడు. అమ్మని పరిచయం చేశాడు ముందు. రాధను చీదరింపుగా చూస్తూ "ఈమె మీ పని మనిషా?" అని అడిగింది.

ఏమీ జవాబు చెప్పలేకపోయాడు.

"ఛీ....ఛీ....ఎంత ఘోరంగా వుందో. నీ ఇంట్లో ఎలా వుంచావు రవీ!'' అన్నది చిరాగ్గా కోమల.

రాధ ఆమె మాటలు పట్టించుకున్నట్టులేదు. కాఫీ టిఫెన్ యిచ్చి ఎంతో మర్యాద చేసింది. కానీ ఆమె కళ్ళు తడికావటం తను గమనించాడు. కోమలతో తనకు స్నేహం అని గ్రహించింది కాబోలు రాధ. తనలో తనే కుమిలిపోయేది. అమ్మ మంచం పట్టింది హఠాత్తుగా. ఆమెకి రాత్రింబవళ్ళు మేలుకుని ఎంతో సేవ చేసేది. అమ్మ ఒక రోజు కన్ను మూసింది. అమ్మ పోవటంతో తనకి మరింత స్వేచ్ఛ లభించింది. అవసరమైనదానికి, అనవసరమైనదానికి కూడా రాధను విసుక్కోవటం ప్రారంభించాడు. రాధని ఒక్కోసారి కొట్టేవాడు కూడా. రాధ క్రమేణా కృశించి పోసాగింది. తిండి తినేదికాదు. నిద్రపోయేదికాదు. ఎప్పుడూ ఆలోచిస్తూ గడిపేది.

ఒక రోజు పనిమనిషి సుబ్బులు చెప్పింది "అమ్మగారు గుండెనొప్పి వచ్చి పడిపోయారు'' అని. ఎందుకో ఆ క్షణంలో రాధని చూడాలనిపించి పోబోతుండగా కోమల ఫోన్ చేసింది. ఆమె ఆహ్వానాన్ని కాదనలేక రాధ సంగతి మరచి వెళ్ళిపోయాను.

# శంఖాల ముగ్గు

సంక్రాంతి పండగ వస్తున్నది. అంచేత చాలా మంది వనితలు సంక్రాంతికి కొత్త కొత్త ముగ్గులతో తమ ఇళ్ళను అలంకరించాలని అనుకుంటూ ఉండ వచ్చు. అటువంటి వారికోసం ఈసారి ఈ 'శంఖాల ముగ్గు'ను ఎలా వెయ్యాలో వివరిస్తున్నాము. ఈ ముగ్గు వెయ్యడం పెద్ద కష్టమేమీకాదు.


మొదటి నాలుగు చుక్కలు ఒక వరుసలో పెట్టుకోవాలి. ఆ తర్వాత ఆ వరుసకు రెండు వైపులా ఒక్కొక్క చుక్క చొప్పున తగ్గిస్తూ ఒక చుక్క వచ్చేదాకా చుక్కలు పెట్టి ఆపాలి. (చిత్రం – 1 చూడండి).


తర్వాత ఆ చుక్కలను చిత్రం 2 లో చూపినట్లు శంఖం ఆకారం వచ్చేటట్లు కలపాలి. ఇప్పుడు ముగ్గులో ఒక శంఖం తయారైంది.

మరింత పెద్దముగ్గు కావాలనుకునేవాళ్ళు మరి కొంత ముందుకు వెళ్ళాలి. వారు మొదట ఒక వరుసలో 16 చుక్కలు ఉంచాలి. ఆ తర్వాత దానికి రెండువైపులా ఒక్కొక్క చుక్క చొప్పున తగ్గిస్తూ, రెండువైపులా ఒక చుక్క వచ్చేదాకా చుక్కలు పెట్టాలి. ఆ తర్వాత ఆ చుక్కలను చిత్రం - 3లో చూపినట్లు కలిపితే 'శంఖాల ముగ్గు' పూర్తవుతుంది.


—ఎస్. లలితా రాజ్యలక్ష్మి

1





2



ఒక రోజు కోమల ఇంటికి వెళ్ళగానే, కోమల పక్కన ఒక యువకుడు కూర్చుని వున్నాడు. అతన్ని నాకు పరిచయం చేసింది.

" మిస్టర్ రవీ! ఇతను మా బావ దయాకర్. స్టేట్స్ నుండి వచ్చారు. నాకు ఈయనగారితో, వచ్చే నెల పెళ్ళి జరగబోతున్నది. తరువాత ఇద్దరం స్టేట్స్ వెళ్ళిపోతాం" అని చెప్పింది నవ్వుతూ.

తన తల తిరిగిపోయింది. కోమల తనను మోసం చేసిందా? తనలో ఎందుకలా ప్రవర్తించింది? ఆ ప్రవర్తనను చూసి, తాను అపార్థం చేసుకున్నాడా? ఇందులో తప్పు ఎవరిది? తనదా? కోమలదా? .... నిస్సంశయంగా తనదే. వెనక ముందులు ఆలోచించుకోకుండా, ఏవో వూహల్లో పడిపోయాడు! తనకు అక్కడ ఒక్క క్షణం కూడా వుండ బుద్ధికాలేదు. తను తిరిగి వస్తుంటే, వెనక నుండి గొల్లున నవ్వులు వినిపించాయి. తన బ్రతుకును ఎవరో హేళన చేస్తున్నట్లు అనిపించింది. వడివడిగా ఇల్లు చేరాడు. రాధకు తను ఎంత ద్రోహం చేశాడో అర్థమైంది. ఆమెను క్షమాపణ కోరాలని ఆత్రుతపడ్డాడు. ఇల్లంతా వెతికాడు. రాధ లేదు. పనిమనిషిని అడిగాడు.

" ఇంకెక్కడి అమ్మగారు? గుండెపోటు బాగా వచ్చింది. వారం రోజుల క్రితమే హాస్పిటల్లో చేర్చాము. ఆమెకి బొత్తిగా స్పృహలేదు " అని చెప్పగానే, గుండెలు అవిసిపోయేలా ఏడ్చాడు; తల బాదుకున్నాడు. దేవతలాంటి రాధకు ఎంత అన్యాయం చేశాడు! బాధతో కుమిలిపోతూ హాస్పిటల్ చేరాడు – రాధ తనని తప్పక క్షమిస్తుందనే ధైర్యంతో.

*

ఆలోచిస్తూ కూచున్న రవీంద్ర చెట్టు మీద తీతువు అరచిన అరుపుకి వులిక్కిపడ్డాడు. టైము చూసుకున్నాడు. మూడు కావస్తున్నది. బరువుగా బాధగా నిట్టూర్చాడు.

" మిస్టర్ రవీంద్రా! డాక్టర్ మిమ్మల్ని పిలుస్తున్నారు " నర్స్ చెప్పింది. గబగబా నడిచి డాక్టర్ వుండే రూమ్ చేరుకున్నాడు.

" సారీ, మిస్టర్ రవీంద్రా! ఎంత ప్రయత్నించినా ఆమెను బ్రతికించలేక పోయాను. అయాం వెరీ సారీ " అన్నాడు తలొంచుకుని డాక్టర్.

"రాధా! ఎంతపని జరిగింది" అంటూ కుప్పలా కూలిపోయాడు రవి. □

Edited & Published by B. Viswanatha Reddi for Chandamama Publications and Printed by B. V. Reddi at Prasad Process Private Ltd., Madras - 600026